సావిత్రి శోభనాచలం వేపు ఆశ్చర్యంగా చూసింది.

"అవును సావిత్రీ! నీతో చాలా ముఖ్యమయిన విషయం మాట్లాడాలి ఇవాళ...."

ఆమె నవ్వింది.

"మాట్లాడండి. ఎవరొద్దన్నారు?"

"పిల్లలు నిద్రపోయాక డాబా మీదకు రా! అక్కడ మాట్లాడుకుందాం."

ఆమె మౌనంగా తలూపింది.

వంట పని పూర్తయాక పిల్లలకు భోజనాలు పెట్టి ఆ తరువాత శోభనాచలాన్ని కూడా భోజనానికి పిలిచిందామె.

భోజనం చేసేప్పుడు ఆ రోజు మొదటిసారి అతను మౌనంగా ఉండడం గమనించిందామె.

అతను మాట్లాడదల్చుకున్న విషయమేమిటో ఆమె ఊహకందట్లం లేదు. ఆర్థిక సమస్యల గురించి అతనెప్పుడూ మాట్లాడడు. ఆయా సమయాల్లో ఏదో ఒక నిర్ణయం తీసుకోవడమే.

అతను మాట్లాడదల్చుకున్న విషయమేమిటో తెలుసుకోవాలని చాలా కుతూహలంగా ఉందామెకి.

మధ్యమధ్యలో ఏం మాట్లాడబోతున్నాడా అన్న విషయం ఆత్రుతను కలుగజేస్తూనే ఉంది గానీ అంతలోనే తొందరెందుకని సరిపెట్టుకుంటోంది.

రాత్రి పదయ్యాక డాబా మీదకు చేరుకుందామె. శోభనాచలం పరుపు మీద పడుకుని పిండార బోసినట్లున్న వెన్నెలను అనుభవిస్తున్నాడు.

అతని పక్కనే కూర్చుంది సావిత్రి.

ఆమెను చూసి అతను లేచి ఆమెకభిముఖంగా కూర్చున్నాడు.

కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా గడచినయ్.

ఈ పదేళ్ళ సంసారంలోనూ ఇది మొదటిసారి-ఇలా నిశ్శబ్దంగా అపరిచితుల్లా మసలడం.

"అనుకోకుండా నాకు తెలీకుండా నేనో పరిస్థితిలో చిక్కుకున్నాను సావిత్రీ! అది ఎలా చెప్పాలో నాకు తెలీడం లేదు. నువ్వు నా మాటలు విని ఆవేశపడవద్దు. నిందించవద్దు. తాపీగా ఆలోచించు! ఆ తరువాత నీవేం ఆలోచించుకున్నదీ నాతో చెప్పు!...."

ఎందుకో సావిత్రి గుండెలు వేగంగా కొట్టుకున్నయ్.

అతను చెప్పబోయే మాటలవల్ల తనకేదో అశుభం జరుగబోతోందేమో అనిపించింది.

"నీకు రాధిక తెలుసుకదూ?" అడిగాడతను.




"మీ ఆఫీసులో పనిచేసే అమ్మాయేనా?" అడిగిందామె.

"అవును!"

"నాకెందుకు తెలీదూ? నాలుగయిదు సార్లు మనింటికి వచ్చింది కదా!"

ఆమె సంగతి ఎందుకు అడుగుతున్నాడో అర్థం కాలేదు సావిత్రికి.

"రాధికా, నేనూ ఎంతో స్నేహంగా ఉంటామని నీకూ తెలుసుగా. నిజం చెప్పాలంటే.... మా స్నేహం ఇప్పుడు ప్రేమగా మారింది. అమె నన్ను ఎంతగా ప్రేమించిందంటే నా కోసం జీవితాంతం వివాహం చేసుకోకుండానే వుండిపోవాలని నిర్ణయించుకుంది..."

సావిత్రి నిర్ఘాంత పోయింది.

# నేనూ ప్రేమిస్తే?

శీలంశెట్టి రమాదేవి.



ఆమెకెందుకో భయం వేసింది.

"ఆమె పరిస్థితి చూసి నేనెంతో బాధపడ్డాను. నీతో నాకెంత చనువుందో, నిన్ను నేనెంతగా ప్రేమిస్తున్నానో అంతటి చనువూ, ప్రేమా ఆమెతో కూడా ఏర్పడ్డాయ్. ఆమెను అలా నిర్దాక్షిణ్యంగా వదలి వేయడానికి నాకు మనసొప్పటం లేదు. అందుకని ఇద్దరం ఎన్నో రోజులు ఆలోచించి ఓ నిర్ణయాని కొచ్చాము. ఈ నిర్ణయం అమలు జరగాలంటే నువ్వు సహకరించాలి. పరిస్థితులన్నీ అర్థం చేసుకుని మసులుకోవాలి ..."

సావిత్రికి కొంచె కొంచెంగా అర్థమవుతోంది. అర్థమవుతున్న కొద్దీ గుండెల్లో ఏదో బాధ.

"నీకు తెలీకుండా రాధికతో గడపడం గానీ లేదా మరోరకమయిన బంధం ఏర్పరుచుకోవడం గానీ నాకిష్టంలేదు. ఇంతవరకూ ఏరోజూ నీకు తెలీకుండా ఏపనీ చేయలేదు. మనసులో ఏ విషయమూ దాచుకోలేదు. అందుచేత మేము ఆలోచించిందేమిటంటే, నేను ఆమెను కూడా వివాహం చేసుకుంటే ఈ సమస్యకో పరిష్కారం ఏర్పడుతుందని. అందువల్ల నిజానికి నీకేమీ అన్యాయం జరుగబోదు. ఆమె ఇప్పుడున్న చోటే వుంటుంది. ఆమెను నేను పోషించాల్సిన బాధ్యత కూడా నాకు లేదు. ఆమె ఉద్యోగమే ఆమెను పోషిస్తుంది. అందువల్ల ఆర్థికంగా కూడా కొత్త సమస్యలేమీ రావు. ఇది జరుగకపోతే ఎవరికీ మానసికంగా శాంతి వుండదు. అందరం అసంతృప్తితో నలిగిపోవాలి. నువ్వు ఈ విషయాలన్నీ ఆలోచించు! ఇలా జరగడం వల్ల జరిగే అనర్థాలేమయినా వున్నాయను కొంటే చెప్పు! వాటిగురించి చర్చించుకుందాం! రాధికను వివాహం చేసుకోవడం నీ మీద అయిష్టం కలిగి గానీ, నువ్వంటే ప్రేమతగ్గి గానీ కాదు. ఆమెతో ఏర్పడ్డ బంధానికి ఓ ఆకృతినివ్వడం మాత్రమే అది...."

మాట్లాడడం ఆపి ఆమె ముఖంలోకి చూశాడతను.

సావిత్రి చలనం లేకుండా మరో వేపుచూస్తోంది.

ఇప్పుడు ఆమెలో అంతకు ముందున్న భయం తొలగి పోయింది. కొద్దిపాటి ఆందోళన మాత్రం మిగిలి వుంది.

ఆమె ఆలోచించే స్థితిలో లేదు. అతను చెప్పిన మాటలు ఆ శక్తిని కూడా హరించి వేసినయ్.

ఇద్దరూ అలా అచేతనస్థితిలో ఎంతసేపు కూర్చుండిపోయారో తెలీదు. వెన్నెల కాంతిని క్రమేపీ మంచు మందగింపచేస్తోంది.

"ఇంక కింద కెళ్ళి పడుకుందామా సావిత్రీ?" అడిగాడతను ఆమె మాట్లాడకుండా లేచి నిలబడింది.

ఇద్దరూ డాబాదిగి ఇంట్లో చెరో మంచం మీదా పడుకున్నారు. నైట్ బల్బ్ వెలుగు కూడా భరించ శక్యం కావడం లేదు సావిత్రికి. పూర్తి చీకటిలో వుంటే బావుండునని వుంది.

ఇప్పుడేమిటి చేయడం? 'తన' అనుకున్న వ్యక్తిని మరో స్త్రీ కూడా అంతటి ప్రేమతోనే ఆరాధిస్తోంది. అందుకు అతను అంతగా కలత చెందటం లేదు. కాని అతని హృదయమంతా తనే నిండి వుండాలన్న కోరికను చంపుకోడానికి మాత్రం మనసొప్పడం లేదు. తనకున్న ప్రత్యేక

స్థానాన్ని ఆమెకూ పంచడం తనను కత్తితో రెండుగా చీల్చినట్లు అనిపిస్తోంది.

అలా అనిపించడంలో తప్పుందా? తనస్థానంలో రాధికే వుండి వుంటే శోభనాచలం అలా చేయడానికి ఆమె అంగీకరించేదా? మరే స్త్రీ అయినా అంగీకరిస్తుందా? ఏమో! తనకెలా తెలుస్తుందా విషయం!

తనకు మాత్రం నచ్చటం లేదు.

అందువల్ల తనకు అన్యాయం జరుగుతుందని భయపడలేదు. ఆర్థికమయిన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందనీ కాదు. అసలు తనకు ఎందుకు అని ఆలోచించేందుకు ఏ కారణమూ కనిపించడం లేదు. అయినా తన మనసు అంగీకరించడం లేదు. అతనిని మరో స్త్రీ పంచుకోవడం అన్న ఆలోచనే మనసుకి బాధ కలిగిస్తోంది. అతనికి తనమీదున్న ప్రేమాభిమానాలు తగ్గకపోవచ్చు. తనను ఎప్పటిలానే ఆదరించవచ్చు. అయినా అవన్నీ మరో స్త్రీకి కూడా లభిస్తున్నాయన్న విషయం కలవరం కలిగిస్తోంది.

ఒకవేళ తను 'కాదు' అంటే ఏం జరుగుతుంది.

అతను తనమాటను జవదాటకుండా వుంటాడా? రాధిక విషయం అక్కడితో అలా వదిలేస్తాడా? వివాహం చేసుకోకుండా ఇప్పటిలాగానే బంధుత్వం కొనసాగిస్తాడా? ఇలాగే రహస్యంగా కలుసుకుంటూ, ప్రేమించుకుంటూ జీవితం గడిపేస్తారా?

పోనీ ఆ పరిస్థితిని తను భరించగలదా? అలా వారిద్దరి సంబంధం కొనసాగడం తనకు బాధ కలిగించదా?

అంతేకాదు. ఒకసారి నిరాకరించాక ఆ తరువాత తనకూ శోభనాచలానికీ మధ్య అగాధం ఏర్పడకుండా వుంటుందా? ఇద్దరి మధ్యా 'దూరం' ఏర్పడుతుంది. ఒకే ఇంట్లో వుంటూ, ఒకరికెదురుగ్గా ఒకరు మసులుతూ, ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ ఆ 'దూరా'న్ని ఎలా సహింవడం?

కొద్ది రోజుల్లోనే పిచ్చి ఎక్కడం తథ్యం తనకు.

సావిత్రి కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్.

ఇలా కన్నీళ్ళు పెట్టడం ఇది మొదటిసారి. తామిద్దరూ ఒకటయిన తర్వాత ఈ పదేళ్ళల్లోనూ అలాంటి పరిస్థితే రాలేదు. మనసుని ఇంతగా హింసించిన సంఘటనే జరగలేదు.

ఆలోచనలతోనే తెల్లవారిపోయింది.

ఆ తరువాత ఆలోచించేందుకు వ్యవధి లేదామెకి. పిల్లలు బడికి వెళ్ళడం, భర్త ఆఫీసుకెళ్ళడం- అంతవరకూ ఆలోచించడానికి కూడా తీరికలేని పని! ఇల్లంతా నిశ్శబ్దం అయిపోయాక తలుపులన్నీ వేసుకుని చీకట్లో కూర్చుందామె.

ఆ రాత్రిలోగా తను భర్తతో ఏం మాట్లాడాలో నిర్ణయించుకోవాలి.

ఏం మాట్లాడుతుంది?

అంగీకరిస్తుందా?

కాదంటుందా?

ఏమో! తనకే తెలీటం లేదు.

ఇలాంటి సంఘటనలు చాలా వాటి గురించి వింది తను. తనకు తెలిసిన కొంతమంది స్త్రీలు తమ అనుభవాలు ఎంతో బాధపడుతూ చెప్పారు తనకి.

ఆ సమయంలో ఆ సమస్య సాంద్రతను తను ఫీలవలేదు. ఎందుకంటే అది మరొకరికి సంబంధించినది.

వాళ్ళు ఆ సమస్యనెలా పరిష్కరించుకున్నారో తనకు తెలీదు. రాజీపడ్డారో లేక సాధించగలిగారో తను పట్టించుకోలేదు.

బహుశా ఏ సమస్యకయినా 'కాలమే' పరిష్కారం అన్న సూత్రం పని చేస్తుంది కాబోలు చాలా విషయాల్లో.

సాయంత్రమయిపోయింది.

పిల్లలు స్కూలు నుంచి వచ్చేశారు.

"అలా వున్నావేం మమ్మీ! జ్వరం వచ్చిందా?" అడిగాడు బాబు.

సావిత్రి మాట్లాడలేదు.

మౌనంగా మళ్ళీ పనిలో మునిగిపోయింది.

శోభనాచలం కొంచెం ఆలస్యంగా ఇంటికి వచ్చాడు.

ఇద్దరూ భోజనాలు ముగించారు.

ఆ సమయం దగ్గరపడుతున్నకొద్దీ ఆమెకు మనసు పరిపరివిధాల పోతోంది.

ఇంకా సేపట్లో అతనికెదుట నిలబడాలి.

మనసులోని విషయాలు మాట్లాడాలి. తన నిర్ణయం తెలియజేయాలి.

ఏమిటది?

ఏమిటా నిర్ణయం?

'సరే' అనా?

'సరే' అంటే ఏమిటి? ఏం జరుగుతుంది. అతను రాధికను వివాహం చేసుకుంటాడు. ఆమెతోనూ తనతోనూ కూడా ఎంతో ఆనందంగా గడుపుతాడు. ఆ తరువాత మరే సమస్యా రాకపోవచ్చు. కొద్ది రోజులు తను లోలోపల బాధపడ్డా 'కాలం' ఆ గాయాన్ని కూడా క్రమేపీ మాన్పించవచ్చు.

ఒకవేళ కాదంటే?

ఆ క్షణం నుంచే నరకం అనుభవంలోకొస్తుంది. తప్పదు. ఇంట్లోనే ఉన్నా అతనిని పూర్తిగా దూరం చేసుకోవాల్సి వస్తుంది.

'నిశ్శబ్దం' అనే విషమ పరిస్థితిని మిగతా


**Statement about ownership of VANITHA (Telugu)**
**Rule 8 (Form VI), Newspapers (Central) Rules, 1956**

| | | | |
|---|---|---|---|
| 1. | *Place of Publication* | ... | 'CHANDAMAMA BUILDINGS' 188, Arcot Road Vadapalani, Madras-600 026 |
| 2. | *Periodicity of Publication* | ... | MONTHLY 1st of each calendar month |
| 3. | *Printer's Name* | ... | B. V. REDDI |
| | *Nationality* | ... | INDIAN |
| | *Address* | ... | Prasad Process Pvt Limited 188, Arcot Road Vadapalani, Madras-600 026 |
| 4. | *Publisher's Name* | ... | B. VISWANATHA REDDI |
| | *Nationality* | ... | INDIAN |
| | *Address* | ... | DOLTON PUBLICATIONS 188, Arcot Road Vadapalani, Madras-600 026 |
| 5. | *Editor's Name* | ... | B. VISWANATHA REDDI |
| | *Nationality* | ... | INDIAN |
| | *Address* | ... | 'CHANDAMAMA BUILDINGS' 188, Arcot Road Vadapalani, Madras-600 026 |
| 6. | *Name & Address of individuals who own the paper* | ... | DOLTON PUBLICATIONS PARTNERS: 1. B. VENUGOPAL REDDI 2. B. VISWANATHA REDDI 3. B. VENKATRAMA REDDY 4. B. N. SURESH REDDY (Kartha of B. L. N. PRASAD - H. U. F) 188, Arcot Road Vadapalani, Madras-600 026 |

I, B. Viswanatha Reddi, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

1st March 1982

B. VISWNATHA REDDI
*Signature of the Publisher*

జీవితమంతా అనుభవించాల్సి వస్తుంది.

రెండు చేతుల్తోనూ కణతలు గట్టిగా నొక్కుకుంది సావిత్రి.

ఇంక ఆలోచించడం అనవసరం.

తను నిర్ణయం తీసుకోలేదు. ఇంతటి దారుణమయిన 'సమస్యను' తన నెత్తిన వేసుకోవడం అనవసరం.

ఆ నిర్ణయమేదో అతని మీదే వదిలేయాలి. అతనిష్టం! అతనెలా చేయదల్చుకుంటే అలా చేసుకోవచ్చని చెప్పేయాలి. తనకేం సంబంధం లేదు. తనకేమీ ప్రమేయం ఉండదు.

కానీ....కానీ....ఒక్క విషయం తనకు అర్థం కావడం లేదిక్కడ?

ఇలా చేయడానికి అతనికింత మనోబలం ఎలా చేకూరింది?

ఇందులోని యుక్తాయుక్తాలు అతనెందుకు విచారించడం లేదు? తను చేయబోతోన్న పని సబబా కాదా అనే విషయం అతని అంతరాత్మకు తెలీదా?

గడియారం పన్నెండు గంటలు కొట్టింది. నైట్ బల్బ్ కాంతికి కళ్ళు మూసుకుంది సావిత్రి.

"సావిత్రీ!"

"ఊఁ!"

"ఆలోచించావా?"

"ఊఁ!"

"ఏమిటి నీ అభిప్రాయం?"

"నాకేమీ అభిప్రాయం లేదు!"

"అంటే?"

"నాకేమీ తెలీడం లేదు. అదంతా మీ ఇష్టం! మీరే నిర్ణయించుకోండి! కానీ నాకిక్కడ ఓ ప్రశ్నకి సమాధానం దొరకడం లేదు. మీకు తెలుస్తే చెప్పండి..."

"ఏమిటది?"

"ఒకవేళ నేనూ మరో అతనిని ప్రేమిస్తే ఏమవుతుంది?"

శోభనాచలం తృళ్ళిపడ్డాడు.

సరిగ్గా అప్పుడే కరెంట్ పోయినట్లుంది. గదంతా చీకటి అలుముకుంది.

నిశ్శబ్దం —

సావిత్రి అతని జవాబుకోసం ఎదురు్చూసి చూసి-ఎప్పుడో నిద్రపోయింది. □




ఫిబ్రవరి సంచిక ముఖచిత్రం చాలా బావుంది. ముఖచిత్రాల విషయంలో మిమ్మల్ని అభినందిస్తున్నాను. 'వింధ్యవాసిని'గారి "అమ్మ మనసు" కథ చాలా బావుంది.

సుజయ్‌శ్రీ — ఆదోని

'ఇంద్రధనుస్సు' కథ ఎంతో ఆసక్తిదాయకంగా ఉంది. తాడిపత్రి శ్రీ బుగ్గ రామలింగేశ్వర ఆలయం గూర్చి, శిల్పకళా నైపుణ్యత గూర్చి చాలా బాగా తెలియచేసారు.

మట్ట పద్మావతి, పర్వత వరలక్ష్మి — సంపర

'వృద్ధశరణాలయం' గురించి చక్కగా వ్రాసారు. కార్పొరేటర్లు, క్రీడాకారిణుల పరిచయాలు బాగున్నాయి.

మీర్జా బాలసరస్వతి — తుని

స్వాతంత్ర్యోద్యమంలో స్త్రీలు : సరోజినీనాయుడు గురించిన వ్యాసం ఎంతో విజ్ఞానదాయకంగా ఉంది. విద్యార్థినుల శీర్షికలో 'చెప్పేదొకటి' చిన్న కథ అయినా దానిలో ఎంతో నీతి ఉంది. మన దేవాలయాలు : 'తాడిపత్రి' గురించిన వ్యాసం, చిత్రాలు చాలా బాగున్నాయి. ఈ వనితలో ముగ్గులు, కార్టూనులు వేయలేదు. ముఖచిత్ర సుందరి 'రచితా కుమార్' వనితకే ఎంతో శోభను చేకూర్చింది.

గమిని రామలక్ష్మి — అత్తిలి

"అమ్మ మనసు" కథ బావుంది. "ప్రపంచం" శీర్షిక నేటి యువతీ యువకులకు దోహదకారిగా వుంది. పరీక్షలకు, ఇంటర్వ్యూలకు హాజరయ్యే విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా వుంది.

కె. దుర్గాభవాని — మచిలీపట్నం

"అమ్మ మనసు" కథ బాగుంది. వివిధ శీర్షికల ద్వారా ఎన్నో విజ్ఞానదాయకమైన విషయాలు మా కందిస్తున్న మీకు మా అభినందనలు తెలియ చేస్తున్నాం.

ఎం. విజయలక్ష్మీశర్మ — తరిగొండ

వనిత స్థాయికన్నా, అంతస్తును పెంచుకొంటోందని చెప్పాల్సి వస్తోందని విచారిస్తున్నాను. ఉదా: వంటలు, ఎంబ్రాయిడరీ వగైరా. ఈ మధ్య ఇచ్చే వంటకాలు, బాగా ఉన్న వాళ్ళకి తప్ప, మధ్య తరగతి గృహిణిలకి ఏ మాత్రం ఉపయోగం కావు. కస్టర్డ్ చాక్లెట్ చేసి నలుగురు పిల్లల్ని తృప్తిపరచ గలమా? లేక వెరయిటీ పులావ్ చేయగలమా? వాటికి వదే దినుసులు, కొన్ని ఊళ్ళలో దొరకవు కూడా. అందుకే అసలు ఆ శీర్షికే దండగ అని పిస్తోంది. వాదావు 50 రూ॥ ఖర్చుచేసి అంత 'ఫలహారం' చేసుకోగల స్థితిలో మామూలు కుటుంబీకులు ఈ రోజున ఉన్నారా? పోతే ఎంబ్రాయిడరీ, నిట్టింగ్ చేస్తే ఏమోగానీ, ఆ నెంబరు సూదులు దారాలు, క్లాత్, అన్నీ సవ్యంగా ఏర్పరచినా, ఒక్కటీ కుదరదు. ఇవి పుస్తకాలలో చూసి, నేర్చుకునే విద్యలు కావు. క్లాసుకి వెళ్ళి ఎంతో ఓర్పుగల ఉపాధ్యాయినుల దగ్గర నేర్చుకోవాలి. లేదా ముందే చేయి తిరిగి ఉంటే క్రొత్తవి వేసేవాళ్ళకి ఉపయోగం. ఇకనైనా తేలికగా అయే చేతిపనులు, ఆదా కూడా చూపే వంటకాలు ప్రచురిస్తారని తలుస్తాను.

జి. ఎస్. శారద — విజయవాడ

సంక్రాంతి కథల పోటీలో ఎన్నికైన కథల్లో శీలంశెట్టి రమాదేవి కథ 'పారడైజ్ లాస్ట్', మల్లాది వెంకటకృష్ణమూర్తి రాసిన 'ఒకటి ఒంటరి అంకె' నవలకు మక్కికిమక్కి కాపీ అని తెలియజేయడానికి విచారిస్తున్నాను.

ఎమ్. విజయలక్ష్మి — ఏలూరు

మీరు రాసిన లెటర్ అందింది. "ఒకటి ఒంటరి అంకె" నవలకి నా కథ పారడైజ్ లాస్ట్‌కి ఎక్కడో కొంచెం పోలిక ఉంటే ఉండవచ్చుగానీ (అదీ ముఖ్య పాత్ర) చాలావరకూ సంబంధం లేదు. అందులో పెళ్ళికాని హీరో యిన్–ఇందులో పెళ్ళికాని హీరోయిన్ ఇదే పోలిక. కనుక 'కాపీ' అని అపోహపడనవసరం లేదు.

— శీలంశెట్టి రమాదేవి, హైదరాబాదు